సాక్షి ప్రకాశం

శుక్రవారం । 5 । ఏప్రిల్ । 2024



చంద్రబాబువి దింపుడు కళ్లం ఆశలు

సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కోవడం చేతగాని చంద్రబాబు జనసేన, బీజేపీ జట్టు కట్టాడని మంత్రి మేరుగు నాగార్జున విమర్శించారు. - IIలో..



వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

మార్కాపురం శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో రాజగోపురాల కలశ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. - IIలో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37/27

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

రంజాన్ వేళలు

శుక్రవారం - ఇఫ్తార్ : సా॥ 6.28
శనివారం - సహరీ : ఉ॥ 4.42



న్యూస్‌రీల్

6 నుంచి వార్షిక పరీక్షలు

ఒంగోలు: ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు వార్షిక పరీక్షలు ఈ నెల 6 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ డి.సుభద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ సంబంధిత పాఠశాలల్లో ఒకటి నుంచి 8వ తరగతి వరకు క్లాస్‌రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్–3, 9వ తరగతికి సమ్మేటివ్ అసెస్‌మెంట్–2 పరీక్షలు జరుగుతాయన్నారు. క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ పరీక్షలు రాసే విద్యార్థులు ఓఎంఆర్‌లో రాయాలన్నారు. 1 నుంచి 5 తరగతుల వరకు ఒకే ఓఎంఆర్ షీట్ ఉంటుందని, 6 నుంచి 8వ తరగతి వరకు మాత్రం లాంగ్వేజ్‌కు ఒకటి, గ్రూపుకు మరొకటి ఓఎంఆర్‌లో రాయాలన్నారు. ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలకు ఓఎంఆర్ సరఫరా చేయడం లేదన్నారు. 1నుంచి 5వ తరగతి వరకు 10వ తేదీన, 6 నుంచి 9 తరగతుల వరకు టోఫెల్ ఎగ్జామ్ ఈనెల 12న ఓఎంఆర్‌లో పరీక్ష నిర్వహిస్తామన్నారు. టోఫెల్ ఎగ్జామ్ పరీక్ష పూర్తయిన తరువాత ఓఎంఆర్ షీట్లను ప్రశ్నాపత్రాలను విద్యార్థుల నుంచి వెనక్కు తీసుకుని జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యాలయానికి పంపాలన్నారు. టోఫెల్ పరీక్షలు నిర్వహించే పాఠశాలల ప్రధానోపాధ్యాయులంతా ఐఎఫ్‌పీ ప్యానల్ సిద్ధం చేసి ఉంచుకోవాలన్నారు. ఐఎఫ్‌పీ ప్యానల్స్ లేని ప్రధానోపాధ్యాయులు, టీచర్స్ ట్యాబ్స్‌ను సిద్ధం చేసుకోవాలన్నారు. మండల విద్యాశాఖ అధికారులు, ఉప విద్యాశాఖ అధికారులు, వారి పరిధిలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో జరుగుతున్న సమ్మేటివ్ 2, క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ 3, టోఫెల్ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించాలని డీఈఓ డి.సుభద్ర ఆదేశించారు.

6న జిల్లాకు మేమంతా సిద్ధం బస్సుయాత్ర

- ముత్తరాసుపాలెంలో బస చేయనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- సీఎం బస చేసే ప్రాంగణాన్ని పరిశీలించిన మంత్రి సురేష్



ముత్తరాసుపాలెం సమీపంలో ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మంత్రి సురేష్

పొన్నలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర పొన్నలూరు మీదుగా కనిగిరికి సాగనుంది. 6వ తేదీ రాత్రికి మండల పరిధిలోని ముత్తరాసుపాలెం సమీపంలోని సీఎం జగన్ మోహన్‌రెడ్డి బస చేసే ప్రాంగణాన్ని మంత్రి సురేష్ గురువారం పరిశీలించారు. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో శనివారం సభ ముగించుకొని కందుకూరు మీదుగా పొన్నలూరు మండల పరిధిలోని ముత్తరాసుపాలెం సమీపంలోని కొత్తగా నిర్మిస్తున్న కారం మిల్లు స్థలంలో రాత్రికి బస చేస్తారని మంత్రి సురేష్ తెలిపారు. ఈ మేరకు మంత్రి సురేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరుసటి రోజు 7వ తేదీ ఉదయం పొన్నలూరు, వెంకుపాలెం, కె.అగ్రహారం మీదుగా కనిగిరి ప్రాంతానికి మేమంతా సిద్ధం బస్సు యాత్ర సాగనుంది.



ఒంగోలు : కర్రసాయంతో..



కంభం : బల్లరిక్షాపై దివ్యాంగ వృద్ధురాలు



ఒంగోలు : సచివాలయానికి మనవరాలితో ట్రైసికిల్‌పై వచ్చిన దివ్యాంగుడు..



ఒంగోలు : యువకుడు సాయంతో..

ఈ పాపం.. పచ్చ మందదే..

మండు వేసవి.. ఉదయం నుంచే వేడిగాలులు.. పింఛను కోసం వృద్ధులు, దివ్యాంగులు అవస్థలు పడుతూ రోడ్డెక్కి మలమలామాడే దుస్థితి కల్పించింది పచ్చ మంద. జిల్లాలో రెండో రోజు గురువారం ఎక్కడ చూసినా అవ్వాతాతలు, దివ్యాంగులు, మహిళలు అవస్థలు పడుతున్న దృశ్యాలే కనిపించాయి. చంద్రబాబు అండ్ కో చేసిన కుట్రలకు అభాగ్యులు బలవుతున్నారంటూ అన్ని వర్గాల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. దీంతో ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకుని రివర్స్ డ్రామాలకు తెరలేపాయి పచ్చ మూకలు. పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం దగ్గర డబ్బుల్లేవంటూ తప్పుడు ప్రచారానికి పూనుకున్నారు. పచ్చ మీడియా పోకడలు చూసిన జనం అవాక్కవుతున్నారు. జరుగుతున్నదేమిటి.. వీరు రాస్తున్నదేమిటని మండిపడుతున్నారు. జిల్లాలో 2.96 లక్షల మంది లబ్ధిదారులకు గానూ బుధ, గురువారాల్లో 2,61,444 మందికి పింఛన్లు అందజేశారు. దాదాపు రూ.79.22 కోట్లు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ వెల్లడించారు. రెండు రోజుల్లో పింఛను పంపిణీ చేసిన తీరు చూశాక పచ్చ పత్రికల వైఖరి ఎలాగుందో అవగతమవుతోంది. చంద్రబాబు గుంపు చేసిన తప్పును కప్పిపుచ్చేందుకు ఆ మీడియా నానా అగచాట్లు పడుతోంది. శుక్ర, శనివారాల్లో కూడా పింఛను పంపిణీ చేస్తామని అధికారులు చెప్పారు.

– ఒంగోలు టౌన్



కురిచేడు : తల్లికి తోడుగా కూతుళ్లు..



ఒంగోలు : ఒకరికి ఒకరు తోడుగా...



ఒంగోలు : పింఛను కోసం ఎదురుచూపులు



మార్కాపురం : పింఛను కోసం నిరీక్షణ





సింగరాయకొండ : సచివాలయాలు 3, 4 వద్ద పింఛన్‌దారుల పడిగాపులు

మీరే నా స్టార్లు..!

- ఏ స్థాయిలో ఉన్నా మీలో ఒకడిని
- పీసీపల్లి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి



సీఎస్‌పురం: మాట్లాడుతున్న ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, పక్కన దద్దాల నారాయణ, ఎమ్మెల్యేలు బుర్రా, సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బాబురావు, చింతలచెరువు, వైఎం ప్రసాద్‌రెడ్డి

పీసీపల్లి: 'మీరే నా స్టార్లు..మీ కోసం ఏమైనా చేస్తా.. ఎందాకైనా వెళతాం' అని వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. గురువారం నియోజకవర్గంలోని పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల, పీసీపల్లిలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. పీసీపల్లిలో జరిగిన వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అధ్యక్షత వహించిన సమావేశంలో చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ 36 ఏళ్లుగా వైఎస్సార్ కుటుంబాన్ని నమ్ముకొని ఉన్నానన్నారు. మీలో ఒకరిగా ఉన్న నన్ను ఈ స్థాయికి తీసుకువచ్చిన వైఎస్సార్ కుటుంబాన్ని జన్మలో మరువలేనని స్పష్టం చేశారు. నమ్మిన వారి కోసం ఎందాకైనా వెళ్తామని నిరూపించిన కుటుంబం వైఎస్సార్ కుటుంబం అన్నారు. ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి నాకు బాధ్యతతో పాటు భయం పెరిగిందన్నారు. ఇంత మంది కుటుంబసభ్యులను ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానన్నారు. 2019లో చంద్రగిరిలో ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత రూ.972 కోట్లతో అభివృద్ధి పనులు చేశానని, నియోజకవర్గ అభివృద్ధిపై 240 పేజీల బుక్ ప్రింట్ చేసి ఇంటింటికీ పంచుతున్నానని, దీన్ని ప్రశ్నించే ప్రతిపక్షం లేదన్నారు. రానున్న కాలంలో అందరికీ అందుబాటులో ఉంటానని, ప్రతి ఒక్కరినీ కలిసి కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు తీసుకువస్తానని భరోసా ఇచ్చారు. కనిగిరి నియోజకవర్గంలో నీటి సమస్య ఎక్కువగా ఉందని, ఫ్లోరైడ్ సమస్యతో ప్రజలు బాధపడుతున్నారని, ఈ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు తాగు, సాగు నీరు అందిస్తామని తెలిపారు. కనిగిరి అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ ఓ సాధారణ జెడ్పీటీసీ అయిన నాకు ఎమ్మెల్యే సీటును కేటాయించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. కుల, మత, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాల రారాజు జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కనిగిరి ఎమ్మెల్యే, కందుకూరు అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ నాకు రాజకీయ దైవం జగన్‌మోహన్ రెడ్డేనన్నారు. మనమంతా జగన్‌మోహన్‌రెడ్డి సైనికులమని, ఆయన మాటే శాసనంగా అందరం ముందుకు సాగుదామన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని, ఎమ్మెల్యేగా దద్దాల నారాయణను గెలిపించి మరోసారి జగన్‌మోహన్ రెడ్డిని సీఎం చేసుకుందామన్నారు. రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు కుయుక్తులు, మోసపు హామీలతో మళ్లీ వస్తున్నారని, ఆయన్ను ఎవ్వరూ నమ్మవద్దన్నారు. పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఉన్నత స్థాయిలో పదవులు కల్పించి గౌరవించారన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, ఎంపీపీ అత్యాల జఫన్య, జెడ్పీటీసీ లక్ష్మీకాంతం ఓకేరెడ్డి, రైతు సంఘ నాయకుడు సూరసాని మోహన్‌రెడ్డి, సొసైటీ బ్యాంకు చైర్మన్ పోలు జయరాంరెడ్డి, కనిగిరి జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, నరాల రమణారెడ్డి, మండల సేవదళ్ అధ్యక్షుడు మూలె రాజశేఖర్‌రెడ్డి, యర్రంరెడ్డి మోహన్‌రెడ్డి, మూలె గోపాల్‌రెడ్డి, చీమల బ్రహ్మారెడ్డి, పీసీపల్లి సర్పంచ్ మరియమ్మ, ఎంపీటీసీ మూలె నారాయణరెడ్డి, స్వప్నకుమారి, బత్తుల అంజయ్య, పేరంరెడ్డి బ్రహ్మారెడ్డి, మహేష్‌నాగ్, కోటిరెడ్డి, పటికల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



పీసీపల్లి ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు



మేమంతా ఒక్కటే..

యానాదులు చైతన్యవంతం కావాలి



యానాదుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

- ఎస్టీలను డిప్యూటీ సీఎం చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిది
- కొత్తపట్నం యానాదుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే బాలినేని

కొత్తపట్నం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో యానాదుల సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు అమలు చేశామని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. కొత్తపట్నం వాసవీ కల్యాణ మండపం సమీపంలో గురువారం రాత్రి యానాదుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి యానాదుల సంక్షేమ పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దొడ్డా శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎస్టీలను డిప్యూటీ సీఎం చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు తన కుమారుడికి మంత్రి పదవి ఇచ్చుకున్నాడే గానీ..మిగిలిన సామాజిక వర్గాలను ఏనాడు పట్టించుకోలేదన్నారు. యానాదులు అన్ని రంగాల్లో వెనకబడి ఉన్నారని, అన్ని రంగాల్లో చైతన్యవంతులు కావాలని కోరారు. మీ పిల్లలను బాగా చదివించి ఉన్నతస్థాయికి తీసుకురావాలన్నారు. మండలంలోని యానాదులకు ఇళ్ల పట్టాలు లేవని, భూమి కొనుగోలు చేసి ఇళ్ల స్థలంతో పాటు ఇల్లు కట్టించి బాధ్యత నాదేనని హామీ ఇచ్చారు. ఒంగోలు నగరంలో 25 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇస్తుంటే జనార్దన్ ఓర్చుకోలేక కోర్టులకు వెళ్లి అడ్డుకునేందుకు ప్రయత్నించాడరన్నారు. మండలంలో 4 వేల మందికి పైగా యానాదుల ఓటర్లు ఉన్నారని, మీరంతా ఫ్యాన్ గుర్తుకు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం కొత్తపట్నం డీడీ కాలనీలో టీడీపీకి చెందిన చెందిన చలంచర్ల ఏసుదాసు, ఇండ్ల రాజశేఖర్ తదితరులు వైఎస్సార్ సీపీలో చేరగా..వారికి బాలినేని కండువా కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చెరుకూరి వీరరాఘవరావు, దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు, మాదిగ చైతన్య వేదిక కన్వీనర్ లక్కపోగు వెంకట్రావు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు పాలిశెట్టి జయరాజ్, మాజీ ఎంపీపీ వాయల మోహన్‌రావు, నాగభూషణం, అమృతాలు, ఒంగోలు కార్పొరేటర్ శ్రీరామ్ నాగభూషణం, నాగమణి, మాకాని వెంకటేశ్వర్లు, పొట్లూరి భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే జనరంజక పాలన



రావులకొల్లులో మాట్లాడుతున్న మంత్రి సురేష్

- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్
- చంద్రబాబు కుట్రలను తిప్పికొట్టాలని పిలుపు

పొన్నలూరు: రాష్ట్రంలో జనరంజక పాలన కొనసాగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని తేటుపేట, రావులకొల్లు, వేంపాడు, వెల్లటూరు, ఆజీపాలెం, మంగపాటివారిపాలెం గ్రామాల్లో గురువారం 'పల్లె పల్లెకు సురేష్ అన్న సిద్ధం' కార్యక్రమం నిర్వహించి ప్రచారం చేపట్టారు. ప్రతి గ్రామంలో ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించి, అడుగడుగునా గ్రామస్తులు బ్రహ్మరథం పట్టారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ చంద్రబాబు గతంలో ఆరు వందల హామీల్లో ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకుండా మళ్లీ ఎన్నికల సమయంలో దొంగ హామీలు గుప్పిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి అవినీతి, అక్రమాలకు చంద్రబాబు పెద్దపీట వేస్తే, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయం, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందించారన్నారు.

చంద్రబాబు కుట్రలు తిప్పికొట్టాలి..

గ్రామాల్లోని ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్లపై కక్షపూరిత పనులు చేస్తూ ఎన్నికల ముందే చంద్రబాబు కుట్రలు బయటపడుతున్నాయని మంత్రి సురేష్ అన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన పథకాలను నాడు తుంగలో తొక్కిన చంద్రబాబు, నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలను సైతం నిర్వీర్యం చేసేలా కుట్రలు పన్నుతున్నారన్నారు. జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, మన్నెం రవణయ్య, పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, మాదాల శ్రీను, చిడిపోతు రమేష్, బత్తిన సుబ్బారావు, చిడిపోతు ఆంజనేయులు, నూకతోటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీగా సుమిత్ సునీల్

- నూతన ఎస్పీగా నియమించిన ఎన్నికల సంఘం
- వైద్యవృత్తిలో కొనసాగుతూనే ఐపీఎస్‌కు ఎంపిక



ఎస్పీ సుమిత్ సునీల్

ఒంగోలు సబర్బన్: జిల్లాకు నూతన ఎస్పీగా గరుడ్ సుమిత్ సునీల్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన రాత్రి 8 గంటల లోగా గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేసుకున్నారు. ఎన్నికల నిబంధనల్లో భాగంగా ఇక్కడ ఎస్పీగా పనిచేస్తున్న పి.పరమేశ్వర రెడ్డిని బదిలీ చేసిన విషయం విదితమే. సుమిత్ సునీల్‌కు జిల్లాలో ప్రాక్టికల్ శిక్షణ పొందిన అనుభవం ఉంది. మహారాష్ట్రకు చెందిన సుమిత్ సునీల్ 2015 ఐపీఎస్ బ్యాచ్‌కు ఏపీ కేడర్‌లో ఎంపికయ్యారు. ఎంబీబీఎస్ పూర్తి చేసి వైద్యునిగా విధులు నిర్వర్తిస్తూనే ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ఐపీఎస్‌లో శిక్షణ అనంతరం ప్రాక్టికల్ శిక్షణ నిమిత్తం జిల్లాకు వచ్చారు. 2018 జనవరి 22వ తేదీ నుంచి 2018 జూన్ 23 వరకు ఐదు నెలల పాటు శిక్షణ పొందారు. చివర్లో చీమకుర్తి స్టేషన్ హౌస్ ఆఫీసర్(ఎస్‌హెచ్‌ఓ)గా విధులు నిర్వర్తించారు. శిక్షణ అనంతరం గ్రేహౌండ్స్ అసిస్టెంట్ కమాండర్‌గా, విశాఖ రేంజ్ పరిధిలోని నర్సీపట్నం, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎస్ఈబీ ఏఎస్పీగా, ఓఎస్డీగా, శ్రీకాకుళం ఏఎస్పీగా, కాకినాడ ఏపీఎస్పీ మూడవ బెటాలియన్ కమాండెంట్‌గా విధులు నిర్వర్తించారు. విశాఖపట్నం డీసీపీ-1గా పనిచేశారు. అనంతరం 2023 ఏప్రిల్ 21 నుంచి ఎస్ఐబీలో ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం

నూతన ఎస్పీగా గరుడ్ సుమిత్ సునీల్ గురువారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. ఎస్పీకి తొలుత అడిషనల్ ఎస్పీ(అడ్మిన్)కె.నాగేశ్వరరావు స్వాగతం పలికారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఐపీఎస్‌గా ఎంపికైన తర్వాత శిక్షణలో ఏఎస్పీగా పనిచేశానని, తిరిగి ఇక్కడకు ఎస్పీగా రావడం సంతోషంగా ఉందన్నారు. రానున్న ఎన్నికలను సజావుగా, సమర్థవంతంగా నిర్వహించడమే తన ముందున్న ప్రధాన లక్ష్యమన్నారు. శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఏఎస్పీ(క్రైమ్స్) ఎం.కిషోర్‌బాబు, ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణతో పాటు ఇతర పోలీస్ అధికారులను ఎస్పీకి పరిచయం చేశారు.

క్లుప్తంగా

సమతావాది డాక్టర్ జగ్జీవన్‌రామ్



మాట్లాడుతున్న ఏకేయూ వీసీ, ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి

ఒంగోలు: కుల నిర్మూలన కోసం కృషి చేసిన సమతావాది డాక్టర్ బాబూ జగ్జీవన్‌రాం అని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వీసీ, ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి పేర్కొన్నారు. గురువారం విశ్వవిద్యాలయం ఆవరణలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ.. జగ్జీవన్‌రాం ఆలిండియా డిప్రెస్డ్ క్లాస్ లీగ్ అనే సంస్థను ఏర్పాటు చేసి కుల నిర్మూలన, అస్పృశ్యత నివారణ కోసం శక్తి వంచన లేకుండా కృషి చేశారన్నారు. దేశ ఉప ప్రధానిగా, రైల్వే మంత్రిగా, కార్మిక శాఖామంత్రిగా బడుగుల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. డాక్టర్ జి.రాజమోహన్ అధ్యక్షత వహించిన సభలో సీఈ డాక్టర్ కేవీఎస్ రాజు , ఏకేయూ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలామణి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ మండే హర్షప్రీతందేవ్ కుమార్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడు మృతి

పొదిలి: పట్టణంలోని విశ్వనాథపురం పెట్రోల్ బంకు సమీపంలో బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. వివరాలు.. నగర పంచాయతీ పరిధిలోని నందిపాలెం గ్రామానికి చెందిన దాసరి గిద్యాన్(24), రవి అనే యువకులు సెకండ్ షో సినిమా చూసేందుకు బైక్‌పై పొదిలి వచ్చారు. సినిమా చూసి తిరిగి ఇంటికెళ్లే క్రమంలో పెట్రోలు బంకు దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన గిద్యాన్‌ను ఒంగోలు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మరో యువకుడు రవికి గాయాలయ్యాయి. రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జగన్ వైపే జన బలం

- ప్రజా సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ పెద్ద పీట
- 58 నెలల్లో సంక్షేమ పథకాలతో రూ.2.70 లక్షల కోట్ల లబ్ధి
- చంద్రబాబు నిర్వాకంతోనే రాష్ట్రంలో 66.60 లక్షల మంది పింఛనుదారులకు కష్టాలు
- అధికారం కోసం ఏ గడ్డి కరవడానికైనా చంద్రబాబు సిద్ధం
- వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి
- వెలిగండ్లలో ఉత్సాహంగా పార్టీ శ్రేణుల ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి. పక్కన పార్టీ నేతలు



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన జనసందోహంలో ఓ భాగం

వెలిగండ్ల: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆశయాల సాధన కోసం వైఎస్సార్ సీపీని స్థాపించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సీఎంగా కాగానే రాష్ట్రంలో సంక్షేమ విప్లవానికి నాంది పలికారని ఆ పార్టీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించి పేదల పక్షపాతిగా నిలిచిన సీఎం వైఎస్ జగన్ వైపే రాష్ట్ర ప్రజలంతా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. గురువారం వెలిగండ్లలో వైఎస్సార్ సీపీ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనంలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. ఒక్క సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కొనేందుకు మూడు పార్టీలు అపవిత్ర పొత్తుతో ఎన్నికలకు సిద్ధమయ్యాయని, ఎంత మంది జట్టు కట్టి వచ్చినా జగనన్న పొత్తు జనంతోనే అని స్పష్టం చేశారు. గడిచిన 58 నెలల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నేరుగా రూ.2.70 లక్షల కోట్లను సీఎం వైఎస్ జగన్ జమ చేశారని పేర్కొన్నారు. సంక్షేమ సారథికి ప్రజలు అండగా ఉండాల్సిన సమయం ఆసన్నమైందని, మళ్లీ జగనన్నను సీఎం చేసుకుంటేనే రాష్ట్రంలో పేదరికం లేకుండా పోతుందన్నారు.

అవ్వాతాతల అవస్థలకు చంద్రబాబే కారకుడు

రాష్ట్రంలో 66 లక్షల 60 వేల మంది పింఛనుదారులకు వలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్లు ఇస్తుండటంతో చంద్రబాబు, ఆయన వందిమాగదులకు కన్నుకుట్టిందని చెవిరెడ్డి ధ్వజమెత్తారు. సీఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టిన తర్వాత సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు చెంతకే పాలన తీసుకొస్తే చంద్రబాబు, ఎల్లో మీడియా నానా యాగీ చేశాయని, వలంటీర్లు ఉంటే తమ ఆటలు సాగవని కుట్రలకు తెరలేపారని మండిపడ్డారు. చంద్రబాబు తన మనుషులతో ఫిర్యాదులు చేయించి వలంటీర్లను తప్పించడంతో అవ్వాతాతలకు మళ్లీ అవస్థలు మొదలయ్యాయని, దుష్ట కూటమి అధికారంలోకి వస్తే ఈ కష్టాలు కొనసాగుతాయన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులను ఎండలో కిలోమీటర్ల మేర నడిపించి, కొందరి మరణానికి కూడా బాబు అండ్ కో కారణమయ్యారని చెవిరెడ్డి నిప్పులు చెరిగారు. ప్రజలపై పగబట్టి హింసకు గురిచేస్తున్న దుష్ట కూటమికి రానున్న ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

☛ కనిగిరి అభ్యర్థి దద్దాల నారాయణయాదవ్ మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా చేసుకునేందుకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కందుకూరు అభ్యర్థి, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో వెలిగండ్ల మండలంలో సుమారు 6 వేలు మెజార్టీ ఇచ్చారని, ఈ దఫా అంతకంటే ఎక్కువ మెజార్టీ ఇవ్వాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు మాట్లాడుతూ.. వెలిగండ్ల మండలం వైఎస్సార్ సీపీకి కంచుకోట అని పేర్కొన్నారు. ఎంపీగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యేగా దద్దాల విజయానికి కృషి చేస్తానన్నారు.

☛ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, ఎంపీపీ రామన మహాలక్ష్మి వైస్ ఎంపీపీ టి.మేరిపుష్ప, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామన తిరుపతిరెడ్డి, మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పొల్లా సుబ్రహ్మణ్యం, స్థానిక సర్పంచ్ టి.సురేష్ బాబు, కనిగిరి జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ప్రముఖ వైద్యుడు పెరుగు మురళీకృష్ణ, సింగిల్ విండో చైర్మెన్ కాకర్ల వెంకటేశ్వర్లు, మోటుపల్లి ఎంపీటీసీ వెంకటగురవయ్య, ఎస్సీసెల్ నాయకులు కటికల వెంకటరత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు వై.నాగూర్ యాదవ్, ఎలికె రమణయ్య, గంజి రవీంద్ర, కె.వెంకట్రామయ్య, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, గూడూరి అనీల్, ఆవుల తిరుపతిరెడ్డి, ఎలికె నారాయణ, టి.నవకుమార్, రామన భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నా జీవితం ప్రజా సేవకే అంకితం

వైఎస్సార్ కుటుంబంతో ఉన్న అనుబంధంతో వైఎస్ జగన్ వెంట నడుస్తున్నానని, ప్రజలకు మంచి చేసేందుకు జగనన్నలాగే దేనికైనా సిద్ధమని చెవిరెడ్డి స్పష్టం చేశారు. సీఎం జగన్ సూచన మేరకు ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు వచ్చానని, ఈ ప్రాంత అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. నేను ఎప్పుడో ఒకరోజు పండక్కో, పబ్బానికో, ఖాళీగా ఉన్న రోజో వచ్చి ప్రజలను దగ్గరకు పిలిపించుకునే వ్యక్తిని కాదని చెప్పారు. ఎంపీగా తనను, కనిగిరి ఎమ్మెల్యేగా దద్దాల నారాయణయాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి తదితరులు



ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

- చెన్నకేశవాలయంలో శాస్త్రోక్తంగా రాజగోపురాల కలశ స్థాపన

మార్కాపురం టౌన్: ప్రసిద్ధిగాంచిన మార్కాపురంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో రాజగోపురాల కలశ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు బృందం వేదమంత్రోచ్ఛారణతో ప్రతిష్ఠ క్రతువులు పూర్తి చేశారు. వందలాది మంది భక్తుల చెన్నకేశవ నామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు కుటుంబ సభ్యులతో సహా పూజల్లో పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి.కేశవరావు, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ డైరెక్టర్ మేడా బద్రీ, పి.నరసింహారావు, డాక్టర కనకదుర్గ, గుంటక సుబ్బారెడ్డి, యక్కలి కాశీవిశ్వనాథం, నాదెళ్ల సుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు గోపాలుని హరిహరరావు, గుంటక విజయలక్ష్మి, కె.సుబ్బమ్మ, వీరయ్య, మహాలక్ష్మి ఆలయ నిర్మాణానికి విరాళం ఇచ్చిన దాతలు పాల్గొన్నారు. మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పట్టణ రూరల్ ఎస్సైలు అబ్దుల్ రెహమాన్, వెంకటేశ్వరనాయక్, బీఎస్ఎఫ్ జవాన్లతో బందోబస్తు నిర్వహించారు. కాగా, ప్రతిష్ఠ ఉత్సవానికి పాసులు లేవనే కారణంతో భక్తులను అనుమతించపోవడంతో అసౌకర్యానికి గురయ్యారు. ఆలయ అధికారులు, కమిటీ సభ్యుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



చక్రస్నానం చేయిస్తున్న అర్చకుడు

కొనకనమిట్ల: వెలుగొండ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో మార్చి 23వ తేదీన ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు 13 రోజులపాటు వైభవంగా సాగి గురువారంతో ముగిశాయి. స్వామివారు రోజుకో వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పుష్కరిణిలో శ్రీవారికి, పెరుమాళ్ల స్వామికి చక్ర స్నానం చేయించి, అనంతరం ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. వేదపండితులు తిరుమలాచార్యులు, పవన్‌కుమార్‌శర్మ, భార్గవచార్యులు పర్యవేక్షణలో ఉభయదాతలు హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు సహకరించిన అన్ని శాఖల అధికారులకు ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సాని కొమ్ము తిరుపతిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మోతకాపులైన తర్లుపాడు మండలం గంఢ్లోపల్లి గ్రామానికి చెందిన యాదవులను అభినందించారు.

వైఎస్సార్ సీపీలోకి 210 కుటుంబాలు



టీడీపీ కార్యకర్తలను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కేపీ

రాచర్ల: మండలంలోని రంగారెడ్డిపల్లె, సత్యవోలు, అనుములపల్లె, అచ్చంపల్లె గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు 210 కుటుంబాలు మార్కాపురం ఎమ్మెల్యే, గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త కేపీ నాగార్జునరెడ్డి సమక్షంలో గురువారం రాత్రి పార్టీలో చేరాయి. వారికి కండువాలు కప్పి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. గిద్దలూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి విజయానికి కృషి చేస్తామని వివరించారు. జెడ్పీటీసీ పగడాల దేవి, శ్రీరంగం , వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ, అనుములపల్లె సర్పంచ్ సిరిగిరి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు కె.పెద్దిరాజు, సూర పాండురంగారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఈ బ్యాంక్ మేనేజర్ మాకొద్దు

- మర్రిపూడి ఏపీజీబీ వద్ద రైతుల ఆందోళన

మర్రిపూడి: స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ పెండ్యాల అనీల్‌కుమార్ తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకులో నూతన మేనేజర్‌ను నియమించాలంటూ మండల రైతులు డిమాండ్ చేశారు. పదుల సంఖ్యలో పొగాకు రైతులు గురువారం బ్యాంక్‌ను ముట్టడించారు. తమ నగదు తమకు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం ఏమిటని మేనేజర్‌ను నిలదీశారు. ఖాతాదారులు, మహిళలతో అసభ్యకరంగా మాట్లాడటమే కాకుండా మరో బ్యాంక్‌కు ఖాతాలు మార్చుకోవాలంటూ ఇష్టానుసారంగా మాట్లాడటాన్ని రైతులు ఆక్షేపించారు. బ్యాంకులో దాచుకున్న డబ్బు అవసరమైనపుడు ఇవ్వకపోతే కూలీలకు, అప్పులిచ్చిన వాళ్లకు తామెలా కట్టాలని, ఇక పురుగు మందు తాగడమే శరణ్యమని రైతులు ఒకింత ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సై శివబసవరాజు బ్యాంక్ వద్దకు చేరుకుని రైతులతో మాట్లాడారు. బ్యాంక్ ఉన్నతాధికారులతోనూ ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని సర్దిచెప్పడంతో రైతులు శాంతించారు.

చంద్రబాబువి దింపుడు కళ్లం ఆశలు

- జనం ఛీకొడుతున్నా జనసేన, బీజేపీతో జట్టు కట్టారు
- 2014 ఎన్నికల్లో 600 పైచిలుకు హామీలిచ్చి మోసం
- ఇప్పుడేమో ఆరు హామీలతో మరోమారు దగా చేసేందుకు కుయుక్తులు
- బాబు, లోకేష్, దత్తపుత్రుడి తీరుపై మంత్రి మేరుగ నాగార్జున ధ్వజం
- పేదలకు ఆర్థిక భరోసా కల్పించింది జగన్ మాత్రమేనని స్పష్టీకరణ



మద్దిపాడులోని ముస్లిం కాలనీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: మీ కుటుంబానికి మంచి చేస్తేనే ఓటు వేయండని కోరుతున్న సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కోవడం చేతగాని చంద్రబాబు జనసేన, బీజేపీ జట్టు కట్టాడని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, సంతనూతలపాడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరుగు నాగార్జున విమర్శించారు. అధికారంపై చంద్రబాబు దింపుడు కళ్లం ఆశలు పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. గురువారం ఆయన మద్దిపాడులోని పైపాలెం, ముస్లిం కాలనీ, ఇందిరమ్మ కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేదలందరికీ ఆర్థిక భరోసా కల్పించి, వారి కుటుంబాల్లో వెలుగులు నింపింది సీఎం వైఎస్ జగన్ మాత్రమేనన్నారు. మరోమారు జగనన్నను సీఎంగా చేసుకునేందుకు బడుగులంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కూటమిగా వచ్చినా, కుయుక్తులు పన్నినా రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌దే విజయమన్నారు. 2014 ఎన్నికల్లో ఇదే కూటమి 600కు పైగా హామీలిచ్చి ప్రజలను దగా చేసిన వైనాన్ని మంత్రి వివరించారు. రుణమాఫీ పేరుతో రైతులు, అక్కచెల్లెమ్మలను చంద్రబాబు మోసం చేసిన తీరును ఎండగట్టారు. చంద్రబాబు, ఆయన పార్టనర్లు చేసిన మోసాన్ని ప్రజలు ఇంకా మరవలేదని, మళ్లీ 6 హామీలంటూ ఊరూరా తిరుగుతూ జనాన్ని ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. వెన్నుపోట్లు, మోసపూరిత హామీలతో 14 ఏళ్లు అధికారం వెలగబెట్టిన చంద్రబాబు.. ప్రజలకు చేసిన మంచి పని ఒక్కటైనా ఉందా అని ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వంలో ఉద్యోగాలే ఇవ్వలేదని ఆరోపించిన చంద్రబాబు, టీడీపీ నేతలు.. లక్షన్నర మంది సచివాలయ ఉద్యోగులతో పింఛన్లు ఇంటింటికీ ఇవ్వాలని చెప్పడం వారి రెండు నాలుకల ధోరణికి అద్దం పడుతోందన్నారు. వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయనివ్వకుండా అడ్డుకున్న చంద్రబాబు.. ప్రజాగ్రహాన్ని చూసి లేఖలు రాసి డ్రామాలకు తెరతీశాడని ధ్వజమెత్తారు. బాబు, ఆయన కుమారుడు, దత్తపుత్రుడు ఏం మాట్లాడుతారో తెలియక ఆ పార్టీ శ్రేణులే తలలు పట్టుకుంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో సంక్షేమ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా నందిగం సురేష్‌ను గెలించాలని కోరారు. మండల పార్టీ కన్వీనర్ మండవ అప్పారావు, పార్టీ ప్రధాన కార్యదర్శి వాకా కోటిరెడ్డి, మరో కార్యదర్శి మోరబోయిన సంజీవరావు, వైస్ ఎంపీపీలు మోరబోయిన విజయలక్ష్మి, పైడిపాటి వెంకట్రావు, సీనియర్ నాయకుడు మజీద్, కోఆప్షన్ మెంబర్ మూసా, గుడ్డపాతల రవి, రాయపాటి రమేష్, మద్దా లక్ష్మీనారాయణ, రామాంజేయులు, బొమ్మల దేవదాసు, పైనం ప్రభాకర్, అన్వేష్, సర్పంచ్ మద్దిరాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

రికార్డ్ అసిస్టెంటా? టీడీపీ కార్యకర్తా?



మాగుంట రాఘవరెడ్డితో మండ్లా నరసింహులు



టీడీపీ సభలో అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ

మార్కాపురం రూరల్/బేస్తవారిపేట: మార్కాపురం మండలం దరిమడుగు గ్రామంలో మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల రికార్డు అసిస్టెంట్ మండ్లా నరసింహులు ఒంగోలు టీడీపీ పార్లమెంటు అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి కుమారుడు రాఘవరెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నాడు. విద్యాశాఖలో పనిచేస్తూ టీడీపీ పార్టీ కండువా కప్పుకోవడం ఏమిటని పలువురు విమర్శిస్తున్నారు. పనిచేస్తున్న పాఠశాలలోనూ సిబ్బంది, విద్యార్థులతో అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా, 'వచ్చేది మా ప్రభుత్వమే.. మీ అందరి సంగతి తేలుస్తా' అని బెదిరిస్తున్నట్లు అతనిపై ఆరోపణలున్నాయి.

టీడీపీ అభ్యర్థి ప్రచారంలో అంగన్‌వాడీ కార్యకర్త

బేస్తవారిపేట మండలం కొత్త మల్లాపురంలో గిద్దలూరు టీడీపీ అభ్యర్థి గురువారం నిర్వహించిన ప్రచారంలో అంగన్‌వాడీ కార్యకర్త మంత్రి రమణమ్మ పాల్గొని కోడ్ ఉల్లంఘించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన రమణమ్మపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు కొందరు గ్రామస్తులు సిద్ధమయ్యారు.

బావిలో పడి వ్యక్తి మృతి

కొత్తపట్నం: మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి బావిలో పడి మృతి చెందిన సంఘటన కొత్తపట్నం మండలం అల్లూరులో గురువారం ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు.. అల్లూరు గ్రామానికి చెందిన షేక్ కాలేషా(45) ప్రైవేట్ స్కూల్ బస్ డ్రైవర్. మద్యం అలవాటు ఉన్న కాలేషా మార్చి 31న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అల్లూరు శివారులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం సమీపంలో ఉన్న బావిలో శవమై తేలాడు. మృతుడి భార్య దరిమాజి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.సాంబశివరావు తెలిపారు.

పాతకక్షల నేపథ్యంలో ఇరువర్గాల ఘర్షణ

- ఓ మహిళకు తీవ్రగాయాలు



ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

అర్ధవీడు(కంభం): పాతగొడవలు, కుటుంబ కలహాల నేపథ్యంలో రెండు కుటుంబాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. సంఘటన అర్ధవీడు మండలంలోని బొమ్మిలింగం గ్రామంలో బుధవారం జరిగింది. వివరాలు.. బొమ్మిలింగం బస్టాండు సెంటర్ లో గోదేశి రాజాకృష్ణ అతని బంధువులు, తోట మల్లేశ్వరరావు అతని బంధువులు ఘర్షణకు దిగారు. రామనరసమ్మ అనే మహిళ తలకు తీవ్రంగా, మిగిలిన వారికి మోస్తరు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిత తెలిపారు. గతంలోనూ ఇరువర్గాలపై అర్ధవీడు పోలీస్‌స్టేషన్‌లో కేసులు ఉన్నట్లు తెలిసింది.